క్లుప్తంగా

అమ్మవారికి కుంకుమ పూజలు



నందిగామ: మండలంలోని లింగాలపాడు శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కి విశేష పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు జరిగాయి. ఆ తరువాత మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామ బోనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాత్రి సమయంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కంచికచర్ల : గ్రంథాలయంలో 15 రోజుల పాటు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తకపఠనం చేయించారు. యోగా, చెస్, డ్రాయింగ్‌పై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, యోగా గురువు నవీన్‌నాని, ఎం.మల్లికార్జునరావు, టీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన మల్లెల నాగవెంకట పవన్, హేమంత్ కుమార్ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. గుంటూరు జిల్లా, యనమదలకు చెందిన దావులూరు సాంబశివరావు, శ్రీలక్ష్మీ దంపతులు రూ.6 వేలు, గుంటూరు పట్టణం, మారుతినగర్‌కు చెందిన బీరం కృష్ణ సమంత రూ.5వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

ఐదుగురికి స్వల్పగాయాలు

కంచికచర్ల : ప్రమాదవశాత్తు ఓ ఆటో పల్టీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్పగాయాలయిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు గుంటూరు జిల్లాకు చెందిన ఎనిమిది మంది తెలంగాణ రాష్ట్రం మధిరకు ఆటోలో ప్రయాణిస్తున్నారు. మండలంలోని కీసర ఇన్వెంటా ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ షాబీరా, షేక్ ఫర్వీన్‌లతోపాటు మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడినవారిని చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేదారేశ్వరపేటకు చెందిన మణికంఠజాన్ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. జాన్‌కు 13ఏళ్ల కిందట జాకీరున్నీసాతో వివాహమైంది. జాన్ షాపులో జగన్‌కుమార్ పని చేస్తుంటాడు. కొంత కాలంగా జాకీరున్నీసాకు జాన్ గురించి లేనిపోని విషయాలు చెబుతున్నాడు. దీంతో భార్యభర్తల మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం జగన్‌కుమార్ జాకీరున్నీసాతో బైక్‌పై కనిపించడంతో జాన్ ప్రశ్నించాడు. దీంతో జగన్‌కుమార్ రాడ్ తీసుకుని దాడికి పాల్పడగా, జాకీరున్నీసా భర్తను కొట్టింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

1న త్రిశక్తి పీఠంలో హనుమజ్జయంతి వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో జూన్ 1వ తేదీన హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- మరో తొమ్మిదిరోజుల్లో ఓట్ల లెక్కింపు
- గెలుపుపై ధీమాలో ఎవరికి వారు



ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

నందిగామ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియగా, మరో తొమ్మిదిరోజుల్లో జూన్ నాలుగోతేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈఎన్నికల్లో నందిగామ నియోజకవర్గంలో ఎవరు గెలుపొందనున్నారనే అంశంపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఎన్నికల కౌంటింగ్ కోసం బరిలో నిలిచిన అభ్యర్థులతోపాటు ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిన నేపథ్యంలో అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల నాయకులు, ప్రజల్లో గెలుపోటములపై మరింత ఆసక్తి పెరిగింది.

87.58 శాతం పోలింగ్:

నందిగామ నియోజకవర్గంలో 87.58శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 90 నుంచి 95శాతం వరకు పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలకు మించి ఈసారి అత్యధికమంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు మండుటెండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండి ఓటేశారు. కొన్ని గ్రామాల్లో రాత్రి పదిగంటల వరకు కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగడం గమనార్హం. పట్టణ ఓటర్ల కంటే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఓటేశారు. రాత్రి పదిగంటల వరకు సాగిన ఓటింగ్ ప్రక్రియ ద్వారా పెరిగిన ఓటింగ్ అధికార పక్షానికి మేలు చేకూరుస్తుందని ఆపార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తొలుత గుడిమెట్ల ఈవీఎంలు..

నందిగామ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 16రౌండ్లలో ఓట్ల లెక్కింపు సాగనుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. తొలుత నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలోని ఈవీఎంలతో ఓట్ల లెక్కింపును ప్రారంభమవుతుంది. తర్వాత నందిగామ మండలం, పట్టణం, వీరులపాడు, కంచికచర్ల మండలాల ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. కంచికచర్ల మండలంలోని గనిఆత్కూరు ఈవీఎంలను లెక్కించడంతో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. నందిగామ నియోజకవర్గానికి సంబంధించి ఇబ్రహీంపట్నం సమీపంలోగల నోవా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల బరిలో నిలిచిన ఆయాపార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లను సిద్ధం చేసుకునేపనిలో నిమగ్నమయ్యారు. మొత్తమ్మీద మరో తొమ్మిది రోజుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్న నేపథ్యంలో గెలుపోటములపై ఆయా రాజకీయపార్టీల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి.

ధనంబోడు కాలనీలో కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తున్న సీఐ పరమేశ్వర్

- ప్రతి ఇంటిని జల్లెడపట్టిన పోలీసులు
- ఎనిమిది బైక్‌లు, ఒక ఆటో సీజ్



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ధనంబోడు కాలనీలో ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ పర్యవేక్షణలో జగ్గయ్యపేట పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టి ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ సీఐ ఎస్. పరమేశ్వర్ మాట్లాడుతూ వచ్చే నెల 4 వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల ఎన్నికల పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో మొత్తం 305 గృహాల్లో సోదా చేసినట్లు చెప్పారు. సోదాలో భాగంగా 120 బైకులు, 3 ఆటోలకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను పరిశీలించామన్నారు. సరైన ధ్రువీకరణపత్రాలులేని ఎనిమిది బైక్‌లు, ఒక ఆటోకు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సబ్‌డివిజన్ పరిధిలోని జగ్గయ్యపేట టౌన్, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎస్‌ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సతీష్, అభిమన్యు, రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎన్నెస్పీ కల్వర్టు

- దెబ్బతిన్న సిమెంట్ కాంక్రీట్
- బయటపడిన ఇనుపచువ్వలు
- విరిగిపోయిన రెయిలింగ్
- ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళనలో రైతన్నలు



గండేపల్లిలో శిథిలావస్థకు చేరిన కల్వర్టు

కంచికచర్ల : మండలంలోని గండేపల్లిలో నాగార్జున సాగర్ కాల్వపై మూడు దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. నిత్యం పంట పొలాలకు వెళ్లే సమయంలో ఈ కల్వర్టు కూలిపోతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో మండల కేంద్రమైన కంచికచర్లకు నిత్యం ఆయా అవసరాల నిమిత్తం పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదే సమయంలో వర్షం కురిసిన సమయంలో నీరంతా ఆ కల్వర్టుపై నిల్వ ఉంటోంది. సిమెంట్ కాంక్రీట్ కూడా శిథిలావస్థకు చేరడంతో కల్వర్టు నిర్మాణ సమయంలో ఏర్పాటుచేసిన ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కల్వర్టుకు రెండువైపులా ఏర్పాటు చేసిన రెయిలింగ్ పూర్తిగా విరిగిపోయింది. కల్వర్టుకు ఏర్పాటు చేసిన ఇనుపచువ్వలు ఊడిపోయాయి. రైతులు పంట ఉత్పత్తులను ఇంటికి తీసుకువచ్చే సమయంలో నానా అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందోనని రైతులు, ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరిన విషయంపై ఎన్నెస్పీ ఏఈ నాగరాజును వివరణ కోరేందుకు ఫోన్‌ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు



నందిగామ: లాడ్జిల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు లాడ్జిలను పోలీసులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, లాడ్జిల్లో ఉంటున్న వారి వివరాలను ఆరా తీశారు. లాడ్జి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు తరచూ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లాడ్జి నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ పండు దొర, పోలీసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



జొన్నలగడ్డ జెడ్పీ పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనానికి హాజరైన 1989-90 బ్యాచ్ విద్యార్థులు

నందిగామ: మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయికకు ఆదివారం వేదికగా మారింది. ఆ పాఠశాలలో 1989-90లో పదోతరగతి చదివిన విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆదివారం రోజు కలుసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ముందుగా ఒకరికొకరు పరిచయం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు కృషిచేసిన తోటిమిత్రులు నాగయ్య, దుర్గాప్రసాద్, జానీలను సత్కరించారు. పూర్వవిద్యార్థులు సురేష్, వెంకట్రామయ్య, శ్రీనివాసరావు, జనార్దన్, గిరి, రామారావు, ఎం.అనిల్‌కుమార్, హనుమంతరావు, మారుతి, పద్మ, శ్రీలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

• భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు









పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు ఆదివారం భారీగా తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. వేలాది వాహనాల్లో భక్తుల తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భారీగా తరలివచ్చిన వాహనాలతో ఆలయ ఆవరణతోపాటు గ్రామంలోని వీధులు కూడా వాహనాలకు పార్కింగ్ ప్లేస్‌లుగా మారిపోయాయి. – పెనుగంచిప్రోలు

జగద్గురువుల బోధనలు ఆచరణీయం



విజయవాడకల్చరల్: జగద్గురువుల బోధనలు సర్వదా ఆచరణీయమని ఆధ్యాత్మికవేత్త మల్లాది వేంకటరామనాథ శర్మ అన్నారు. సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే హనుమత్ జయంతి ఉత్సవాలు, జగద్గురువు వైభవం ఆధ్యాత్మిక ప్రసంగాలు హనుమత్ దేవాలయంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. రామనాథ శర్మ భారతీ తీర్థ మహాస్వామి వైభవం అంశంగా ప్రసంగించారు. శృంగేరీ పీఠాధిపతిగా భారతీ తీర్థ వేద సంస్కృతికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారతీ తీర్థులు గుంటూరు జిల్లాకు చెందిన వారని, చిన్నతనం నుంచే వేదాధ్యయనం చేశారని తెలిపారు. అభినవ విద్యాతీర్థ స్వామివారి అనుగ్రహంతో 1974వ సంవత్సరంలో సన్యాసాశ్రమం స్వీకరించారని 1989లో శృంగేరీ పీఠాధిపత్యం వహించి నాటి నుంచి వేద సంస్కృతికి, ధర్మరక్షణకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఆర్‌ఆర్‌లో పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 4,001 నుంచి 8 వేల ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగతుందన్నారు. 28వ తేదీ మంగళవారం 17,001 నుంచి 22 వేలు, 29వ తేదీ 33,001 నుంచి 38 వేలు, 30వ తేదీ గురువారం 49,001 నుంచి 54 వేలు, 31వ తేదీ శుక్రవారం 59,001 నుంచి 67 వేలు ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అలాగే వచ్చే నెల 1వ తేదీ శనివారం 75,001 నుంచి 83,500, 2వ తేదీ ఆదివారం 92,001 నుంచి లక్ష , 3వ తేదీ సోమవారం లక్షా 8,001 నుంచి లక్షా 16 వేలు ర్యాంకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక బైక్, రూ. 16,800 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

కోడిపందేలపై దాడి

మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక కోడి పుంజు, నాలుగు బైకులు, రూ.4,210 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రేపటి నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాల ప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో ఈ నెల 28వ తేదీ నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమవుతాయని పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. 28వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి హనుమత్ దీక్షలను విరమిస్తారన్నారు. 28వ తేదీ ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి పూజా కార్యక్రమాలతో దీక్ష విరమణలు ప్రారంభమవుతాయని వివరించారు.

సర్వరోగాలకు యోగా దివ్యౌషధం





శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జేసీ డాక్టర్ సంపత్‌కుమార్, శిక్షణకు హాజరైన యువతీయువకులు

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సర్వ రోగాలకు యోగా దివ్య ఔషధమని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్రతి రోజు కొంత సమయం యోగాకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ఉచిత యోగా శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ సంపత్ కుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి శరీరం మనసుల మధ్య సమతౌల్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ప్రపంచ మానవాళికి గొప్ప వరం యోగా అని పేర్కొన్నారు. మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా చిన్నారులు రోజంతా టీవీ, సెల్ ఫోన్లు చూస్తూ సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు అలసత్వానికి గురవుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు యోగాసనాలు వైపు మక్కువ చూపేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు.

ఏటా 2 వేల మందికిపై శిక్షణ

అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ.. 2017వ సంవత్సరం నుంచి తమ అసోసియేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రతి ఏటా 2 వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణను అందిస్తున్నామన్నారు. కార్యదర్శి పి.వి.రమణ మాట్లాడుతూ.. యోగాసనాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఉచిత యోగ శిక్షణ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా గురువు అంకాల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు ప్రాణాయామం వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, సీహెచ్ అరుణ్‌కుమార్, ఎండీ ఇక్బాల్, కోశాధికారి లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ కె.గాంధీబాబు, కొనకళ్ల రెడ్డమ్మ, పిల్లి ప్రశాంత్ కుమార్, సభ్యులు, యోగా సాధకులు, ఏరోబిక్ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జార్జి పి.శాలెం రాజు, పి.మౌనిక, పి.శృతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎ.కొండూరు: రేపూడి గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు బి. జమలారెడ్డి ఇటీవల మృతి చెందారు. క్షీరబంధు పథకం ద్వారా రూ. 50 వేల ఆర్థిక సహాయం చెక్కును మృతుడి భార్య వెంకమ్మకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ సభ్యులు విజయలక్ష్మి, బ్రహ్మానందరెడ్డి, పాల్గొన్నారు.